ఫీచర్

# క్రూరదర్శన్

◆ మోర్తల ప్రభాకర్ రెడ్డి ◆

దాదాపు ఐదు వేల సంవత్సరాల క్రితం తీండేమండలం అనే పర్వత ప్రాంతంలో అంగస్థంధుడు అనే మహర్షి వుండేవాడు.

ఆయుర్వేద తైలం ఎడ్వర్టైజ్‌మెంట్‌లోలా నెరిసిన జుట్టు, గెడ్డంతో తనంతగా తెల్లబడని కేశ సంపద కల్గిన కొంతమంది పిల్ల సన్యాసులకి తను అజీర్తితో బాధపడుతున్నప్పుడు రచించిన నాట్య శాస్త్రాన్ని ఒకనాడు అభినయపూర్వకంగా వివరిస్తుండగా తెగులుడు, తేటజూడు అనే రాక్షసులు ఆయన్ని బండరాళ్ళతో కొట్టి, తమ భాషలో అలాంటి బూతులే తిట్టి ఆనందించగా, ఆ మహర్షి ఆగ్రహం పట్టలేక తనను శారీరకంగా హింసించినందుకు వాళ్ళ జాతి ఎలుక సంతతిలా వృద్ధిచెంది అనతి కాలంలోనే ఆరుకోట్లు అధిగమించి అందరి చేత తెలుగు వాళ్ళు లేక ఆంధ్రులు అని పిలవబడి నిత్యం తన్నుకు ఛస్తూ అన్ని రంగాల్లో వెనకబడతారనీ, అంతేకాక తన శాస్త్రాన్ని అవహేళన చేసినందుకుగాను 'క్రూరదర్శిని' అనే యంత్రం ఉద్భవించి, ఇరవై నాలుగు గంటలూ ఆ యంత్ర ప్రభావం వల్ల నరకయాతన అనుభవిస్తారని శపించి పళ్ళికిలించాడు.

ఆ రాక్షసద్వయం అందుకు భయపడి శాపవిమోచన కోసం ప్రాధేయపడగా కొంత జాలిపడి, శాపం, పార్ట్ వన్‌కి తిరుగులేదని పార్టు టుకి మాత్రం కొంత మినహాయింపు యిచ్చి, ఇరవై నాలుగు గంటల బదులు రోజుకి నాలుగు గంటలు మాత్రమే హింసింపబడతారని చెప్పి మరెవరినైన శపించే అవకాశం దొరుకుతుందేమోనని అడవిలోకి వెళ్ళిపోయాడు.

క్రూరదర్శిని వాతబడిన అందరి దయనీయ అనుభవాలు ఆయంత్ర ప్రభావం విడివిడిగా వివరంగా చెప్పాలంటే ఎల్ కె.జీ చదివే పిల్లల స్కూల్ బ్యాగ్ అంత బరువు గ్రంథం అవుతుంది. కాబట్టి ఎక్కువ మంది అనుభవాలు అభిప్రాయాలు అవగతం చేసుకోడానికే, వీలుగా వుంటుందని ఒక్క కార్యక్రమం గురించి మాత్రం చెప్పుకుందాం.

ఒకానొక వారంలో అదీ దిక్కు మాలిన రోజు సుబ్బారావు హెల్మెట్ పెట్టుకుని టీ.వీ. ఆన్ చేసాడు. అతని భార్య పేరిందేవి మొగుడు తనని వారం రోజులుగా సినిమాకి తీసుకెళ్ళలేదనే కోపంతో వంట చేస్తూ... జంతువులు విసర్జించే ఒకానొక పదార్థంలా అన్నిటినీ మాడ్చేస్తోంది కసిగా.

ఇంతలో మలేరియా పేషంట్‌లా ఉన్న ఓ అమ్మాయి బొమ్మ తెర మీద కనిపించింది. ఆమె ప్రతి నాలుగు పదాలకో తప్పు చొప్పున తెలుగుభాషని భ్రష్టుపట్టిస్తూ రాబోయే విపత్తు అదే కార్యక్రమం గురించి తుఫాను హెచ్చరికలాంటిదేదో చెప్పి అదృశ్యమైంది.

● ● ●

మలేరియా పేషెంటులా ఉన్న ఓ అమ్మాయి బొమ్మ తెర మీద కనిపించింది.

ఓ నికృష్టపు అర్థం పర్థంలేని డిజైన్ స్క్రీన్ మీద కనిపించింది.

● ● ●

## ఇలాంటి కార్యక్రమాలు జీవితం మీద విరక్తి కలిగిస్తాయి.

పేరిందేవి గబగబా పరిగెత్తుకొచ్చి ఆ అమ్మాయి వెళ్ళిపోయిందా? అంది తల ఉన్నా తోక లేకుండా. సుబ్బారావు అలవాటు చొప్పున ఆవులించి ఏ అమ్మాయి అని హెల్మెట్ సర్దుకున్నాడు. అదేనండి ఇందాక టీ.విలో కనిపించిన అమ్మాయి. "ఆమె ఎవరుకున్నారు?" అని, సుబ్బారావు నోరు తెరవ భోతుంటే చప్పున "ఆమె మా వేలు విడిచిన మేనమామ పెద్దకూతురి చిన్నకోడలు అంది గర్వంగా. సుబ్బారావు నోరు తక్కువ తెరిచి "ఆహా.. అలాగా మరీ అంత దగ్గరి వాళ్ళనుకోలేదు సుమీ" అని ఆ పూటకి అరవై ఆరోసారి ఆవులించాడు.

"గతిలేని ప్రశ్నలు— మతిలేని జవాబులు" కార్యక్రమం కొద్ది క్షణాల్లో ప్రసారం అని మఫ్ఫీమలేరియా పేషెంట్ హెచ్చరించి మాయమైంది.

పేరిందేవి ఆత్రంగా ప్రోగ్రాం చూడ్డానికి సిద్ధపడబోతుంటే మరేం తొందరలేదు... కొద్ది క్షణాల్లో అంటే... మీ ఆడాళ్ళు ముస్తాబవుతూ అంటారే... అబ్బ... యిదిగో వచ్చేస్తున్నా అయిపోయింది" అని అలా అన్నమాట.. వెళ్ళు.. ముందు వంట సంగతి చూడు" అని విసుక్కున్నాడు సుబ్బారావు.

పేరిందేవి మూతి, కుడి — ఎడమలవైపు తాత్కాలికంగా పక్షపాతం వచ్చినట్టు మూడేసి అంగుళాలు సాగదీసి, గునుస్తూ లోపలికెళ్ళింది. మరో క్షణం తర్వాత గిన్నెల జాడి మ్యూజిక్ వినబడింది.

కాసేపటికి ఓ ఆకారం స్క్రీన్ మీద కనబడ్డంతో అంత వరకూ ఆరోజు న్యూస్ పేపరు చించి పోగులు పెడుతూ రాక్షసానందం అనుభవిస్తున్న రంజీ—బుజ్జీలు ఆ ఆట ఆపేసి భయంగా టీ.వి. వైపు మిడిగుడ్లేసుకుని చూస్తుండడం గమనించి సుబ్బారావు ప్రమోషన్ వచ్చినతంగా ఆనందించాడు. అంతలోనే అతను కూడా ఏంటినా ఫాల్ట్ వల్ల బొమ్మ అలా కన్పిస్తుందేమోనని సరి వేద్దామని గబగబా మేడమీదికి పరిగెత్తబోతుంటే "మీది మరీ చోద్యం.. టీ.వీ నిక్షేపంగానే పనిచేస్తోంది... ఆ మొహం తీరే అంత... పేరు గుండురావ్.." మీరెప్పుడు చూడలేదుగా అంది పేరిందేవి గుండూరావేదో ఆమె చిరకాల నేస్తం అయినట్టు భర్తకి పరిచయం చేసి కాస్త కూడా భయం లేకుండా టీవీ వైపే చూస్తూ.

గుండూరావ్ కెదురుగా బస్తా ఉత్తరాలు వళ్ళో వేసుకుని ప్రేక్షకుల వైపు తప్ప మరెటైనా చూస్తున్నట్టున్న ఓ సంతోషిమాత కనబడింది. అయిన దానికి కాని దానికి చెవుల దాకా ఎప్పుడూ నవ్వుతుంటుందని సుబ్బారావు ఫ్రెండ్ పాండురంగం ఆమెకా పేరు పెట్టాడు.

అబ్బ వాళ్ళిద్దరూ ఎంత బాగా మాట్లాడతారండి.. అసలు క్రూరదర్శన్ కే ఈ ప్రోగ్రాం హైలైట్ కదండీ... అంది పేరిందేవి బరువుగా కుర్చీలో కూర్చుంటూ.


ఆమె అమాయకత్వానికి, అభిరుచికి సుబ్బారావు బాధగా జాలిపడి, విరక్తిగా నవ్వాడు.

బేతాళపురం నుండి విక్రమార్కుల వారు రాసిన ఉత్తరం అందుకుని "ఇప్పటికి తొమ్మిది వందల తొంభై తొమ్మిది ఉత్తరాలు రాసినా... ఒక్కదానికీ మోక్షం కలగలేదు. ఈసారి ఉత్తరానికి జవాబు తెలిసీ చెప్పకపోతే మీ స్టూడియో ముందే ఉరేసుకు చచ్చిపోతూ అందుకు శ్రీ గుండూరావు గారే బాధ్యులు అని రాసి మరీ చస్తాను" అని రాసాడు అంది స.మా చెవులదాకా నవ్వుతూ.

కర్చీఫ్‌తో చెమట తుడుచుకుని హీనస్వరంతో ఇందులో నా తప్పేం లేదు. అందుకు బాధ్యులైన మా డైరెక్టర్ గారి పేరు..." అని మరేదో చెప్పబోతున్న గుండూరావ్ మాటలు మధ్యలోనే ఆగిపోయాయి. 'అంతరాయం' అన్న అక్షరాలతో క్రూరదర్శిని స్టాఫ్ ఆర్టిస్టు కాబోలు వేసిన దారుణమైన రెండు పిచ్చుక బొమ్మల పెయింటింగ్ కనిపించింది.

.బ్యాక్ గ్రౌండ్‌లో అమ్మా... బాబో' అని ఎవరో అదో రకమైన గొంతుతో వాళ్ళ తల్లిదండ్రులను పిలుస్తున్నట్టు. మధ్య... మధ్యలో ఢిఢీ.. ధన్... ఢాం" అన్న శబ్దాలు కూడా వినిపించాయి.

ఓ నిమిషం తర్వాత గుండూరావ్ గుండు మీద ఐదారు బొంగులతో చెంపల మీద వేళ్ళ వారికల గుర్తులతో కనిపించాడు. రెండో ఉత్తరం చదవండి అన్నాడు ముక్కు వీదుతూ.




అజీర్తినగర్ నుండి ఆనందరావు, పిచ్చిరెడ్డి, తాయారమ్మ అంటూ ఓ దండకం మొదలెట్టింది స.మా. పేరిందేవి పిల్లలకి అన్నాలు పెట్టి, వాళ్ళకి కాశీమజిలీ కథలు చెప్పి పడుకోబెట్టి వచ్చింది. ఆలోగా స.మా ఆఖరు పేరు చదివి చెంబెడునీళ్ళు తాగి 'వీళ్ళందరూ చిత్రలహరి అనే పేరు ఆ ప్రోగ్రాంకి నప్పలేదని చిత్రాలుహారీ అని మార్చండి.. వారం రోజులు చొంగ కారుస్తూ ఎదురు చూసి... మీరు చూపించే దౌర్భాగ్యపు పాటలు చూసే బాధ మాకు తప్పుతుంది. లేకుంటే పూర్తిగా వ్యాపార ప్రకటనలు చూపిస్తే వాటికైనా రాబడి పెరుగుతుందని" వాపోతున్నారు అంది స.మా పట్టుచీర జరీ బార్డర్ సరిచేసుకుంటూ.

గుండూరావ్ తల ప్రక్కకి వాల్చి బిగదీసుకుపో

## విడిపోయారు



'బాబి డియోల్ నీలం'లు విడిపోయారని తెలుస్తోంది. అందుకు కారణం పూజాభట్‌తో బాబి ప్రేమ వ్యవహారం నడుపుతుండడమేనట. నీలం ఆ నిజాన్ని భరించలేక పోతోంది. ''ఏది ఏమైనా పూజ వల్ల కాని, మరో అమ్మాయి వల్ల కానీ మేము విడిపోలేదు, విడిపోము. మా కారణాలు మాకున్నాయి. బాబీ, పూజతో తిరుగుతున్నాడో లేదో నాకు తెలియదు'' అని చెప్పిందామె.

యి వాలా చక్కటి సలహా. మాకంతవరకూ తోచనే లేదు. మేం వేసినవే నోర్మూసుకుని చూడక... గొంతెమ్మ కోర్కెలూ వీళ్ళు.. అయినా ప్రేక్షకుల కోరిక మన్నించి వచ్చే వారం నుంచి పూర్తిగా ప్రకటనలే చూపిస్తాం... అన్నాడు శాడిస్టులా నవ్వుతూ.

ఓ పెద్దదుడ్డుకర్రతో నానా బూతులు తిడుతూ టీ.వీ. మీదికి దండెత్తిన పేరిందేవిని అతి కష్టం మీద ఆపాడు సుబ్బారావు. అసలుకే తీసేస్తారట. ఎంత కసాయి గుండె ఆ చిత్రలహరి తెలుగు సినిమాలే.. కదండి నాలాటి గడపదాటని సతీమతల్లులకే కాస్తో కూస్తో ఆనందం కలిగించేవి. అవీ లేకపోతే ఇక టీ.వీ. ఎందుకూ? అంటూ భార్య మరోసారి టీ.వి. వైపు లాంగ్ జంప్ చేయబోతుంటే... ''నీకేమైనా పిచ్చా వెర్రా..? లేక రెండూనా? అది మన టీ.వి. మరి వీపో యూవా చేతులు అంత దురదగా వుంటే ప్రక్కింటి పార్వతమ్మగారిది విరగ్గొట్టు. వాళ్ళది ఓనిడా టీ.వి. ఆమె ఏమీ అనుకోదులే.. అన్నాడు సుబ్బారావు తాత్కాలికంగా తమ టీ.వి కాపాడుకుంటూ.

కొత్తకోట నుంచి పెట్టుడు చీరెల పేరమ్మ కట్టుడు చీరెల కాంతమ్మ గార్లు ''6.12.86న ప్రసారం వేసిన చీరెలూ—సారెలూ కార్యక్రమంలో చీరెల నాణ్యత గురించి ఎన్ని అసందర్భ విషయాలు చెప్పిన మూగాంబిగాదేవి కట్టుకున్న కాషాయిరంగు పట్టుచీర ఆరణిదా... కంజీవరందా.. అనేది అంతుబట్టక తిన్నది అరక్క చర్చించుకుంటున్నాం. దయతో అంటూ మిగతాది పూర్తి చేసింది స.మా. మొహం కాషాయివర్ణంలోకి మార్చుకుని.

గుండూరావ్ తన పళ్ళతో ఓ మార్కుడ్రిల్ వేయించి అద్భుత రహస్యం చెబుతున్నట్టు గుసగుసగా మీ ఇద్దరి అంచనా తప్పు అని చెప్పడానికి సంతోషిస్తున్నాము. ఆ చీర ఆరణీ కాదు. కంజీవరంది కాదు. అది మూగాంబికాదేవి గారి ఎదురింటి ఏకాక్షి గారిది .. అసలు ఆమె కట్టుకున్న ఏ చీర ఆమెది కాదు. అడుక్కునే అమ్మకి ఆరువందలా అరవై నాలుగు చీరెలు. అనే జీవిత సత్యం శెలవిచ్చి తను చెప్పింది స.మా కూడా వర్తిస్తుందని స్ఫురించి మరో ఉత్తరం చదవండి అన్నాడు ఖంగారుగా.

స.మా. పళ్ళుకొరుక్కుంటూ (ఆమెవే) రహమత్ నగర్ నుండి రహీంపాషా.. లడ్డూమియా .. భేషరంబేగం... మొ.వారు గత వారం ప్రసారం అయిన అశోకచక్రవర్తి... తెలుగు భాషకి ఆయన చేసిన సేవలు అనే సాహిత్య కార్యక్రమంలో పాల్గొన్న మేధావులంతా శక్తివంచన లేకుండా తమ పాండిత్యం ప్రదర్శించి మమ్మల్ని ఆనందాశయంతో చిత్రవధ చేశారు. కేవలం పదినిమిషాలే ప్రోగ్రాం ప్రసారం చేసినందుకు కృతజ్ఞతలు అంటున్నారు అంది.

వారి సాహిత్యాభిలాష దృష్టిలో పెట్టుకుని జంబుద్వీపాన్ని పాలించిన వాతాపికొండ అనబడే రాజు గారి కాలంలో హీబ్రూ భాషకి ఆయన చేయని సేవల గురించి ఆ భాషలోనే కొంతమంది సాహితీ విమర్శకులు పాల్గొన్న కార్యక్రమం త్వరలో ప్రసారం చేస్తున్నాం. అయితే ఈసారి ప్రోగ్రాం వ్యవధి కేవలం ఒక గంట మాత్రమే ఉంటుంది అని చెప్పడానికి విచారిస్తున్నాం అన్నాడు గద్గద స్వరంతో.

చిత్రపరిశ్రమనుండి చిరంజీవి, శోభన్ బాబు, అమల, శ్రీదేవి అంటూ అరవై ఏడు పేర్లు చదివి వీరంతా చూస్తారా? ఛస్తారా? నాటకంలోని నటులంతా తమ తమ పాత్రలకి విపరీతమైన న్యాయం చేసి మాకు తీరని అన్యాయం చేసారు. ఇలాంటి కార్యక్రమాలు జీవితం మీద విరక్తి కలిగిస్తాయి.

ఎక్స్చేంజ్ ప్రోగ్రాం క్రింద ఇతర రాష్ట్రాల్లో వున్న తెలుగువారి కోసం ప్రత్యేకించండి. రోగం కుదురుతుంది అంది స.మా మొదటిసారి ప్రేక్షకుల వైపు చూస్తూ.

నిజానికి అప్పుడామె గుండూరావుని చూసుంటుందని ప్రత్యేకించి చెప్పార్సింది లేదనుకోండి.

ఆ కార్యక్రమం గురించి ప్రశంసలేమైనా ఉన్నాయా అన్నాడు గు.రా. అలవాటు చొప్పున. ''ఏం లేవు మనమే రాసినవి తప్ప'' పరధ్యానంగా అని తన పొరపాటు గ్రహించి బిక్కమొహం పెట్టుక్కూర్చుంది స.మా.

మరుక్షణం యధావిధి అంతరాయం బోర్డు... ఓ వికృష్టపు అర్థం పర్థంలేని డిజైన్ స్క్రీన్ మీద కనిపించాయి. మరో నిమిషం తర్వాత స.మా అశోకవనంలో సీతలా కనిపించింది. మొహం వాచి వుంది. బహుశా చివాట్లు తినుంటుంది. గుండురావ్ మొహం జవహర్ జ్యోతిలా వెలిగిపోతోంది.

తరుణీతరుణం కార్యక్రమంలో పనిలేని పాపాయమ్మగారు పనికిరాని చెత్తా చెదారంతో పనికొచ్చే చెత్తసామాగ్రి ఎలా చెయ్యాలో చూపిన తీరు అద్భుతం. అంటూ పతివ్రతల కాలనీ నుండి, పుండరీకం, కువేలరావు, దైవసహాయం మొ. రాసారంది దుఃఖమాత అతి కష్టం మీద వెక్కిళ్ళు ఆపుకుంటూ.

విమర్శలేమైనా... అని ఊపిరి బిగపట్టాడు గు.రా. ''మొన్నేగా నాలుగు బస్తాలు.. చిత్తు కాగితాలు వారికి అమ్మింది.. అని నోటిదాకా వచ్చింది. అంతలోనే అంతరాయం బోర్డు వైపు కెమెరా మళ్ళబోవడం గమనించి 'అబ్బే ఏం లేవు అని అరించింది కీమగా స.మా.

వ్యవసాయదారుల కార్యక్రమం గురించి ఏమైనా... అంటూ భయంగా బిగుసుకు పోయాడు గు.రా.

సస్యశ్యామల పురం నుండి ఆవాలి వీరయ చౌదరి, నీరసం రమణారెడ్డి మొ.వారు ''మీ వ్యవసాయదారుల కార్యక్రమాలు దాంతో సంబంధం లేని వారికి బానే వుండొచ్చు. కానీ అవి చూసి వ్యవసాయం చేద్దామనుకునే వారికి మాత్రం బొచ్చెలో రాయే మిగులుతుంది. ఇది మేం అనుభవపూర్వకంగా గ్రహించాం. మేలుజాతి కొబ్బరి చెట్లు పెంపకం కార్యక్రమం చూసి అర్జెంటుగా అప్పులుచేసి మేము నాటాం. ఆ తర్వాత ఏం చెయ్యాలో మీరు ఇంత వరకూ చూపించలేదు. నాలుగేళ్ళు కావస్తున్నా వేసిన మొక్కలు అలాగే వున్నాయి. మొక్కల కోసం తీసిన గోతుల్లోపడి చాలా మంది కాళ్ళు విరగ్గొట్టుకుంటున్నారు. దయతో మిగతా వివరాలతో కార్యక్రమం ప్రసారం చేసి మమ్మల్ని ఆదుకోండి. అని వాళ్ళ కన్నీళ్ళతో తడిసి అట్టలు గట్టిన ఉత్తరం ఎలాగో పూర్తివేసింది స.మా.

గుండూరావ్ ఓ క్షణం తీక్షణంగా ఆలోచించి ''అలాగే వీలు చూస్కాని రెండేళ్ళల్లోగా ప్రసారం

వేస్తాం'' అన్నాడు వరాలిచ్చే వేల్పులా.

బంజారాహిల్స్ నుంచి కుబేరారావ్ ''వ్యవసాయం వేయడం ఎంతో కష్టం అనే మా దురభిప్రాయాన్ని తొలగించారు. అది అన్నిటికన్నా తేలిక, లాభం అని మీ కార్యక్రమాల వల్ల అర్థమైంది. త్వరలో మాకు సిటీలో వున్న లక్షలాస్తి చవగ్గా అమ్మేసి అర్జంటుగా ఏటూరు నాగారంలో ఏడొందల ఎకరాల్లో వ్యవసాయం చేద్దామని తీర్మానించుకున్నాం'' అంటూ కూస్తున్నారు.. సారీ.. రాస్తున్నారు అంది స.మా. ఆయనెవరో నిజంగా చవగ్గా అమ్మేస్తే తనో ప్లాట్ తీసుకుందామని ఆశతో ఎడ్రస్ గుర్తు పెట్టుకుంటూ.

''ఏమండీ మనం కూడా వ్యవసాయం చేద్దామండీ'' అంది పేరిందేవి అవలీలగా లక్షలు సంపాయించడానికి ఏదో లాటరీ టికెట్ కొందామా అన్నంత తేలిగ్గా.

భార్య తెలివి తక్కువ తనానికి లోలోపలే కుమిలిపోయి అంతలోనే తనలాంటి వాడ్ని కూడా ఆమె అందగాడని నమ్మేస్తుంది అని గుర్తొచ్చి గిల్టీగా ఫీలై క్షమించాడు.

చింతలబస్తీ నుండి ఆనందం ఆరోగ్యవర్ధి గార్లకు పందుల పెంపకంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు ఉడతలు పట్టడంలో మెళకువులు మొ. కార్యక్రమాలు ఎంతగానో నచ్చాయట. ఆ చేత్తోటే తొండలు పట్టడంలో మెళకువులు మేలు కోరే పందికొక్కుల పెంపంకంలో కొత్త పద్ధతుల గురించి రాబోయే దసరా రోజు ప్రత్యేకంగా ప్రసారం చెయ్యమని ప్రార్థేయపడుతున్నారని అంది మొసలిలా నోరు తెరిచి ఆవులిస్తూ స.మా.

వారి కోరిక సానుభూతితో పరిశీలిస్తాం. అయితే గాడిద తన్నకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఈగలు తోలడంలో మెళకువలు ఇత్యాది ఎన్నో కార్యక్రమాలు ప్రసారానికి సిద్ధంగా వున్నాయి కాబట్టి వారి కోరిక తీర్చడానికి కొంత టైం పడుతుంది అంటూ తన తలపై వాలిన ఓ ఈగను కొత్త పద్ధతిలో కసిగా కొట్టాడు గుండూరావ్.

ఫ్లోర్ మేనేజర్ కార్యక్రమం మొదలైనప్పటి నుంచి ముగించమని బ్రేక్ డాన్స్ వేస్తున్నారు. మరో పాతిక మాత్రం చదివి శెలవు తీసుకుందాం అన్నాడు గుండూరావ్ గబగబా.

లలిత సంగీతం కార్యక్రమంలో గత పదేళ్ళుగా పాడిందే పాటగా పాడిపళ్ళ దాసరి అన్నట్టు మమ్మల్ని కాల్చుకు తింటున్నారు. మా ఇంట్లో దాదాపు అందరికీ అన్ని పాటలూ కంఠతా వచ్చేశాయి. అసలు మాకు బుద్ధి జ్ఞానం ఉన్నాయా... తినేది అన్నమేనా... కొత్త గాయనీ గాయకులు పాటలు దొరక్కనా.. లేక కొత్తవాళ్ళతో బేరాలు కుదరడంలేదా...? అంత డబ్బు ఏం చేస్తున్నారు... పోయేటప్పుడు కట్టుకుపోతారా... అయ్ ... అంటూ ఘాటుగా దుబ్బాక నుండి పెడసరం పెద్దక్క... కుప్పిగంతుల కుముదవల్లి యింకా అంటూ ఓ బస్తా ఉత్తరాల వైపు చూపించి కిసుక్కున నవ్వింది స.మా. చాలా సేపటి తర్వాత.

గుండూరావ్ కోపంగా ''ఫ్రీగా వస్తుంటే వినడానికి ఏం మాయరోగం. వింటే వినండి లేకపోతే ఛావండి. కొత్తపాటలంట మళ్ళీ మాట్లాడితే ఈ సారి ఓ పూటంతా వేలం పాటలూ లేకపోతే నేనే రాసిన మహిషాసుర మర్దిని పద్యాలతో సహా ప్రసారం వేస్తాం ఖబడ్దార్ అని గడగడా గ్లాసు నీళ్ళు తాగాడు.

ఈ మధ్య మనం చెక్రిస్తాన్ వాళ్ళను చూసి వాత పెట్టుకుని ప్రసారం వేసిన క్విజ్ కార్యక్రమం ఎంతో గొప్పగా ఓ చక్కటి హాస్య నాటిక చూస్తున్న అనుభూతి కలిగిందని తమకు తెలియని ఎన్నో గొప్ప విషయాలు తెలిసాయని కప్ప బెక బెక మంటుందనీ, పోచమ్మ గుడి హైద్రాబాద్‌లో ఏ రోడ్డు ప్రక్కన ఉండేది ముఖ్యంగా టెన్నిస్ ఆట పదిమందితో ఆడతారని యిన్నాళ్ళు అజ్ఞానంతో మూసుకు పోయిన మా కళ్ళు కేవలం జట్టుకి ఏనిమిది మందితో మాత్రమే ఆడతారని తెలిపి మా కళ్ళు తెరిపించారని మరి కొన్ని గొప్ప విషయాలు వాళ్ళ తెలుసుకున్నవి ఏకరువు పెట్టి ఆ ఉత్తరం రాసిన పుణ్యపురుషుడి పేరు ఎడ్రెస్‌తో సహా స్మరించింది స.మా.

వీరముష్టి కాలనీ నుండి కుతూహలమ్మ సందేహశాస్త్రి అప్పుడప్పుడు మాకు టీవీలోంచి కుక్కలు మొరుగుతున్నట్టు, నక్కలు అరుస్తున్నట్టు, గాడిదలు ఓండ్ర పెడుతున్నట్టు యిలా ఏవేవో వింత ధ్వనులు వినబడుతుంటాయి. మీ స్టూడియో దగ్గర్లో జూగానీ అడవిగానీ ఉందా అంది స.మా. తనని అంత వరకూ నికృష్టమైన యాంగిల్ లో చూపించిన కెమెరా మ్యాన్‌ని మింగేసేలా చూస్తూ.

గుండూరావ్ ఓ క్షణం తడబడి అబ్బే అదేం లేదే. బహుశా మీరు మా స్టాఫ్ సరదాగా మాట్లాడుకోవడం పొరపాటున వినుంటారు. అంతే, అన్నాడు తన సమయస్ఫూర్తికి తనే మురిసిపోతూ.

పిడుగుల పురం నుండి మాస్టర్ కాలంతక్, బేబీ తెలివి, తమ స్కూల్ పిల్లలు తయారు చేసిన పెద్దలకు మాత్రమే సెక్స్ జీవితామా? అనే రెండు నాటికలు ప్రదర్శించేందుకు అనుమతినిస్తారా అని అడుగుతున్నారు అంది అన్నేళ్ళొచ్చినా తనూ మాత్రం రాయడం రానందుకు సిగ్గుపడుతూ స.మా.

బుద్ధిగా చదుకోక నాటికలు గట్రా అని పిచ్చి వేషాలేస్తే మాబడి ప్రోగ్రాంతో పాటు మనం లోగడ ప్రసారం చేసిన తప్పు — ఒప్పు అన్న నాటిక వరుసగా వారం రోజులు ప్రసారం చేస్తాం అని చెప్పండి అన్నాడు గుండూరావు గుడ్లురిమితునే చెబుతూ.

ఆఖరి ఉత్తరం అగ్రహారం నుండి వంకల వెంకమాంబ చాదస్తం చలమయ్య గార్లు న్యూస్ రీడర్స్ వార్తలు ముగిస్తూ ఒకరు శెలవ్ అని మరొకరు నమస్కారం అనడం ఏమీ బాగోలేదు అంటున్నారు అని మిగతా ఉత్తరాలు ఓ మూలకి విసిరికొట్టింది.

గుండూరావ్ ఓ క్షణం బిగుసుకుపోయి అలాగే పాపం! అసలు మీలాంటి వాళ్ళకి కూడా నమస్కారం అని చెప్పడమే గొప్ప. అయినా అంతగా ఇదవుతున్నారు కాబట్టి ఇక నుంచి మిమ్మల్ని ఆనేపుడు చల్లగా చూడాలి అనో మీ ఇంటిల్లిపాదికి మా ముద్దులు అనో చెప్పేస్తాం అంటూ మరేదో మొరుగుతుండగా కరెంట్ పోయింది.



## హిందీలో ఐశ్వర్య

ఒకనాటి ప్రముఖ నటి లక్ష్మి కూతురు సినిమా రంగంలోకి ప్రవేశించి ఎన్నో చిత్రాలలో హీరోయిన్‌గా నటించినా నటిగా స్థిరపడలేక పోయిందనే చెప్పాలి. ఇప్పుడు తన అదృష్టాన్ని పరీక్షించుకోదలచి సౌత్ నుంచి నార్త్‌కి వెళ్ళింది. ఆమె తొలిసారిగా 'జాకీ ష్రాఫ్' ప్రక్కన 'గార్దిష్' చిత్రంలో నటిస్తోంది. ఏమో! ఆమెకు అక్కడ దశ తిరగొచ్చు!